
రాయలసీమ సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ప్రేమకథ రాయాలనుకుని ఈ వేదవతి కథ ప్రారంభించాను. విభజనానంతర రాయలసీమ నీటిపారుదల సమస్యల గురించి ఆలోచిస్తున్నందువల్ల అనివార్యంగా కథను ఆ సమస్యతోనే ప్రారంభించాల్సి వచ్చింది. ఈ కథలోని కథకుడు నంజుండ అనే పాత్రను చేరడానికీ, నజుండ ఎదుర్కొంటున్న ఘర్షణ నుంచి అతడిని బయటపడేయడానికీ రాయలసీమ ఉద్యమమే సాధనమని భావించాను.

జి. వెంకటకృష్ణ

# 10

# వేదవతి

ఏలె లక్ష్మణ్





మారుతి ఆ సమావేశ మందిరమంతా కలియదిరుగుతున్నాడు. కన్పిం చిన వాళ్లందర్నీ పేరుపెట్టి మరీ పలకరిస్తున్నాడు. తెలుగు, కన్నడ భాషలు రెండూ కలగలిసిన మాటలతో హాలంతా కొత్త సంగీతసందడిలా వుంది. ఆ భాషా, ఆ పలుకుబడితో పాటు యీ మనుషుల్ని చూస్తుంటే యేదో పురాతనత్వంలో నేను తేలియాడుతున్నట్లుంది. పురాతనత్వమంటే వెనుక బాటుతనమేనా లేక ఆధునికత సోకనితనమా? ఆధునికత సోకినా కూడా వెనుకబాటుతనంలో యెంతమంది లేరూ? ఇంతమందిని చూస్తున్నానా సెల్‌ఫోన్‌లో మునిగినవాళ్లు వొక్కరూ లేరు! చాలామంది ముతక తెల్ల బట్టల్లో తలకు చుట్టిన తుండుగుడ్డలతో, అక్కడక్కడా ప్యాంట్లు తొడిగిన వాళ్లున్నా భుజాల మీద టవల్తో! నాకు యిట్లా మనుషులను గమనిస్తూ కూచోవడం యిష్టమైన పని. 'వేదవతిని చూపిస్తా ఆలూరు వస్తావా,' అని మారుతీ అడుగుతూనే ఎగిరిగంతేసి యీ సమావేశానికొచ్చానా, వేదవతిని మించి వేదవతి గట్లమీద నివసిస్తున్న యీ మనుషుల్ని చూడ్డం యిష్టంగా వుంది. వీళ్ల హావభావాలూ, నవ్వులూ, చేతులు విసరడాలూ, దీర్ఘాలతో మాట్లాడడాలూ, అట్లా చూడ్డంలో యేమీలేనితనంలో కూడా యెన్నో వింతలు కనిపిస్తాయి. దూరంగా దగ్గరగా చూపులు విసురుతూ నేనందర్నీ గమనిస్తున్నాననుకుంటున్నాగానీ నన్ను కూడా ఒక మనిషి పట్టిపట్టి చూస్తున్నట్టు అనిపిస్తోంది. నల్లగా దృఢంగా తీక్షణమైన చూపులు గలతను నన్ను పదేపదే చూస్తున్నాడు. నేనతన్ని చూసినప్పుడు చూపులు తప్పు కుంటున్నాడు.

"వేదవతి అందరే యావుదో?" (వేదవతి అంటే యేదిరా) ఒకతను అడుగుతున్నాడు.

"వేదవతి అంటే మీ వూరిపక్కన పారే హగరీ వంకనేరా," పక్క నున్న తను చెప్పాడు.

వేదవతి ఒక నది. కర్ణాటకలో బాబా బుడంగిరి కొండల్లో పుట్టి, కర్ణాటక నుంచి రాయలసీమలోకి అనంతపురం జిల్లాలో ప్రవేశిస్తుంది. అక్కడ్నుంచీ కర్నూలు జిల్లా ఆలూరు ప్రాంతంలో కర్నూలు-బళ్లారి జిల్లాల సరిహద్దుగా ప్రయాణించి తుంగభద్ర నదిలో కలుస్తుంది. యేటా

అంతో యింతో నీళ్లుండే నది. నది ఒడ్డున యీ ప్రాంతాల్లో కరువు కాపురం చేస్తుంటే నదినీళ్లేమో గలగలా తుంగభద్రలో కలిసి అటు నుంచి కృష్ణానదిలో పడి కిందికే వెళ్లిపోతుంటాయి. వేదవతి నీళ్లు నిలుపుకోవడానికి యే యేర్పాట్లూ లేవు. ప్రజలకి యిన్ని యేండ్లగా ఆ ఆలోచన కూడా లేదు. ఇప్పుడిప్పుడే మారుతిలాంటి వాళ్లు యీ ప్రాంతంలో వేదవతిమీద చిన్న యెత్తిపోతల పథకం కోసం ప్రజల్ని కూడగడుతూ వున్నారు. దానిగురించే యీ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులతో, రైతులతో యీ సమావేశం యేర్పాటుచేశారు. నేను ఆటలో అరటిపండులా వేడుక చూడ్డానికి వచ్చిన వాణ్ణి.

"హాగేను సార్, హాగె మాడ్రే నమ్మగె వొళ్లేదా..."

(అట్లనా సార్, అట్ల చేస్తే మాకు మంచిదా...)

అనడుగుతున్నాడు ఒకాయన, మారుతిని.

"నన్నడిగితే శానా మంచిదనే చెప్తా బజారన్నా. మీకేమి మంచిదో మీరే తెలుసుకోవల్లగదా. మీరు గూడా నాయకులు గదా! మీ ప్రాంతానికి మంచేందో చెడేందో మీకు తెలిసిండాలబ్బా... నా మీద నమ్మకముంటే మంచిదే. నేను చెప్పిందే మీరు యినుకోవాలనిగాదు. నీళ్లుంటేనే గదా పంటలు పండేది. మన హగరీ నదిలో ప్రతియేటా యెన్నోటు నీళ్లు తుంగభద్రలో కలుస్తున్నాయో మీ కండ్లతో చూస్తానే వున్నారు. ఔనా కాదా రంగన్న పెద్నాయనా, వాటిని మన దగ్గర ఆపుకుంటే మన రైతులకు యింత ప్రాణం పోసినట్లైతుందా లేదా? దాన్ని గురించి మనం యోచన చేయాల్నని యీ మీటింగు. యిక్కడ మాట్లాడుకొని మరచిపొయ్యేది కాదు, మన వూర్లలో అందరికీ చెప్పాలా..."

"బాగా సెప్తివి సారూ... మనూరి పిల్లగానివి కాబట్టి మన రైతులు గురించి యోచన సేసుండావు నువ్వు. యీ కార్యముకి యెంత ఖర్చవుతుందో."

"యెంతోగాదు పెద్నాయనా అంతా నూరూ నూటిరవై కోట్లతోని అయిపోతుంది. బాబు సీయెం గున్నెప్పుడు జీవోగూడా యిచ్చిండా, అదుగో ఆ సార్ను చూసేవా, సుబ్బారాయుడు సారని పెద్ద ఇంజినీరు. మొన్నామొన్నదాకా ప్రభుత్వంలో ఇంజనీర్లుకే పెద్ద ఇంజనీర్‌గా వుద్యోగం చేసినాడు. పెద్ద పెద్ద ఆనకట్లను కట్టే ప్లాన్లు గీసేది యిట్లా సార్లే. సార్లట్లా వాళ్లు మనెంబడి సానామంది వుండారు. వాళ్లు లెక్కలేసి చెప్పిండేదే యిదంతా. ప్రభుత్వం గోదావరి పుష్కరాలనీ కృష్ణా పుష్కరాలనీ వందలకోట్ల రూపాయలు ఖర్చు పెడుతుంది. ఆ ఖర్చులో పదిపైసలు భాగంతో మనం అడుగుతుండే ప్రాజెక్టు కట్టొచ్చు."

"మళ్లా అంత పెద్ద కట్ట కడితే యెన్ని భూములు మునిగిపోతాయో, దానికి వొప్పుకోవల్లగదా రైతులు..."

“నువ్వు అడిగింది కరెక్ట్... అట్లా విషయాలు అడిగి తెలుసుకోనీకీ, గవర్న మెంట్‌ను గట్టిగా అడగనీకీ మిమ్మల్ని తయారుజేయనీకె యీ మీటింగు. మీరు కూచొని వింటే విషయాలు తెలుస్తాయ్. మీరూ మీకొచ్చే డౌట్లు అడగొచ్చు... కూచోండి మళ్లా...” అంటున్నాడు మారుతి.

సమావేశానికి ప్రధానవక్తగా వచ్చిన రిటైర్డ్ ఛీఫ్ ఇంజనీర్ సుబ్బరాయుడు సారు కర్నూలు జిల్లా పశ్చిమభాగానున్న ఆలూరు ప్రాంతం అశోకుడు పాలనలో వుండిన సువర్ణగిరి అనీ అప్పటినుంచి ఇప్పటి వరకు యీ ప్రాంతానికి యెంతో చరిత్ర వున్నా, కరువూ కాటకాలు మాత్రం పట్టిపీడిస్తూనే వున్నాయనీ, ఆ బాధలు తీరాలంటే నీటి పారుదల వుండాలనీ, యిక్కడ పారే నదినీటిని నిలుపుకుంటే రైతులకు వుపయోగపడు తుందనీ దానికి తక్కువ ఖర్చుతో తక్కువ పొలాల మునకతో సాధించుకోవచ్చని వివరించాడు.

రాయలసీమ విద్యావంతుల వేదిక తరఫున వచ్చిన మరో యిద్దరు వక్తలు కూడా చాలా వివరాలు చెప్పారు. అయ్యవార్లు పాఠాలు చెబితే శ్రద్ధగా వినే పిల్లల్లాగా, అప్పుడప్పుడు తలలూపుతూ, వొకర్నొకరు ఆశ్చర్యంగా చూసుకుంటూ, వచ్చిన రైతు లంతా వినడం చూస్తే నాకు చాలా ముచ్చటేసింది. ప్రజలు చాలా నష్టపోయారనీ యిప్పుడైనా మేల్కొని యిట్లాంటి ముఖ్యమైనవి సాధించుకోవాలనే అభిప్రాయం వాళ్లకు అర్థమైందని, మారుతి చొరవ తీసుకుని సమావేశానికొచ్చిన కొందరితో మాట్లాడించి నప్పుడు తెలిసింది. అయితే అనుమానాలు వ్యక్తం చేసినవాళ్లూ వున్నారు. నన్ను గమ నిస్తున్న నల్లటి ఎర్రజీరల కళ్ల మనిషి లేచి, అభ్యంతరాలు చెబుతుంటే, గమనించిన మారుతి-

‘సిద్ధలింగప్ప అన్నా పైకిరా, పైకొచ్చి మాట్లాడమని,’ అతన్ని వేదిక నెక్కించాడు.

“మా వూరు పాళ్యం అదే కురబలపాళ్యం. ఇరవై అడుగుల గోడ కట్టి యెత్తి పోతల పథకం నుంచి తుంగభద్ర కాలువలోకి నీళ్లు తీసుకుపోతామంటున్నారు. నది మా వూరి దగ్గర్నుంచీనే పోతుంది. మావూరు మునుగుతుందేమో, ఆ వూరి సర్పంచిని నేను, మావూరోళ్లు వొప్పుకోరు దీనికి,” అని సందేహం వ్యక్తం చేశాడు.

దానికి సుబ్బరాయుడు సార్, “వూరు మునిగేంత నీళ్లు నిలబడవు. నిలబడే నీటిని యెప్పటికప్పుడు పంపులు ద్వారా తోడి కాలువలోకి పంపిణీ చేస్తా,”రని చెప్పి, అతన్ని సమాధానపరిచాడు.

సమావేశం ముగించుకొని హాల్ నుంచి బయటకు పోతున్నప్పుడు, నన్ను గమని స్తూండిన పాళ్యం సర్పంచి సిద్ధలింగప్ప నా దగ్గరకొచ్చి-

"మీరు హర్ధగేరి వెల్ఫేర్ హాస్టళ్లలో వుండి ఆడనే హైస్కూల్ వరకూ చదువుకున్నారు గదా సార్," అన్నాడు.

"అవునండీ చదువుకున్నా, మీకెలా తెల్సు," ఆశ్చర్యంగా చూసా.

"అప్పటి మీ జతగాడు నంజుండ గుర్తున్నాడా సార్," అన్నాడు.

హర్ధగేరి వెల్ఫేర్ హాస్టల్ రోజుల నాటి జ్ఞాపకాలన్నీ ఒక్క క్షణం నా మనసులోకి తోసుకుంటూ వచ్చేశాయి. వాటితో పాటు కెంచన్నగారి నంజుండ... నన్నంటుకొని తిరిగిన నా జతగాడు. చీకటంటే భయం. ఒక్కడే వుండటమంటే భయం. పగలైనా సరే యెవరూ లేని గదుల్లోకి పోవడమంటే భయం. ఆ నంజుండ గుర్తులేకేమి.

"అవునండీ, గుర్తున్నాడు. మీరు అతనికి యేమవుతారు."

"వాని మేనమామ సార్ నేను. మా యింట్లో అందరికీ మీరు బాగా తెలుసు, మీరు రాసిన బుక్కులు మావోని దగ్గరుండాయి. మీ గురించి పేపర్లలో కన్పించినప్పుడల్లా మా నంజుండ శానా సంబరపడతాడు... ఒకసారి మా వూరికి రాండి సార్."

"ఓహో మీరు నంజుండ మామనా. సంతోషమండీ. నేనేమంత పెద్ద రచయితను కాదులెండి. అంత చెప్పుకోవడానికేమీ లేదుగానీ, యెలా వున్నాడు నంజుండ. ఎక్కడున్నాడు..." ఆసక్తిగా అడిగా.

"హేగిదానందరే హేళోకాగల్లా సార్. వొట్టుమేలే హేళొబేకందరే చెన్నాగిల్లా..." ఒక్కసారిగా అతను కన్నడంలోకి వెళ్లాడు. గొంతున దుఖాన్ని అణచిపెట్టుకుంటున్నట్టూ తెలుస్తోంది. బాధ సహజంగా మాతృభాషలో పలుతుందనుకుంటా. వెంటనే తెలుగులో కొచ్చి,

"పెళ్లి పెటాకులు లేకుండా వాడొక మాయదారి రోగం పాలున పడ్డాడు సార్, ఒకసారి వొచ్చి పలకరిచ్చిపోండి సార్," అన్నాడు.

"అరే! అట్లైనాడాండీ పాపం. నేను మాట్లాడతా, అతడి నెంబర్ యివ్వండి," పొడిపొడిగా అన్నట్టున్నాను. పాపం నిరాశ పడ్డట్టున్నాడు. సిద్ధలింగప్ప ముఖంలో అది కన్పించింది.

భోజనాలు ముగించుకొని కర్నూలుకు తిరిగి వచ్చేటప్పుడు, మారుతి సిద్ధలింగప్ప గురించి ప్రస్తావించాడు.

"నీ గురించి చానా చానా అడిగినాడ్సార్. నీ పుస్తకాలు గురించి కూడా తెలుసు. నీ మీద చానా గురుంది. ఆయన అల్లుడు నిన్ను చూడాలని అనుకుంటున్నాడంట, వాళ్లూరికంట పోనంటపో. ఎప్పుడు పోతావో చెప్పు నేనూ వస్తా. సిద్ధలింగప్పకు యీ ప్రాజెక్టు మీద మంచి అభిప్రాయం యేర్పరుద్దాం. ఇదేగాదు, ఆ వూరికి పెద్ద కథుంది. యీ సిద్ధలింగప్ప ఒకానొకప్పుడు పేద్ద ఫ్యాక్షన్ నడిపినోడు. నీ కథలకు పనికొస్తుంది."

"మారుతిగారూ ఎప్పుడో పదోక్లాసు నాటి స్నేహం. ఇప్పటికీ నన్ను గుర్తుపెట్టుకోవడం గొప్పే, కాదనను. ఇన్నేళ్లలో మనిషి యెంతగా మారిపోయుంటాడో. తీరా వెళ్లాక అప్పటి మనిషి కాదని తెలిస్తే నిరాశ కాదూ. అప్పటి జ్ఞాపకాల్లోని అమాయకత్వాలూ, అనుభూతులూ అలాగే వుండనీయండి, వెళ్లి యెందుకు వాటిని చెరిపేసుకోవాలి. ఇక ఫ్యాక్షన్ కథావస్తువంటారా అదెప్పుడో పాతబడి పోయింది. ఫ్యాక్షన్ కూడా రూపం మార్చుకుందని మీకూ తెలుసు. పాత కథలు రాసే వోపిక నాకూ లేదు."

"అబ్బా సారూ యింత యోచన అవసరమా. నిన్ను గుర్తుపెట్టుకున్నాడంటేనే అదే ఒక గుర్తు ఏమీ మారలేదని. ఇంకా నీ పుస్తకాలు చదువుతున్నాడంటే నువ్వేమి ఎదిగావో చూస్తున్నట్టు లెక్క. యింకా యిప్పటి వేదవతి వుద్యమానికి ఆ వూరే ఒక కేంద్రం. వెళ్లడానికి యిన్ని అనుకూలాలున్నాయ్. నిన్ను చదివే ఒక పాఠకుణ్ని చూడ్డానికి పోదాం అనుకొని పదా. నేనూ వస్తా..."

"నిజమే మీరు చెప్పింది కూడా వాస్తవమే. పాజిటివ్‌గా ఆలోచిస్తే పోవడమే కరెక్ట్ అనిపిస్తుంది. సరే పోదాంలెండి," అన్నా.

## 2

ఆలూరు నుంచి వచ్చాక నా పనుల్లో పడి నంజుండను మరిచిపోయా. నేను మరచిపోయినా, నంజుండ మాట్లాడడం ప్రారంభించాడు. ఆ మాటల్లో యేదో వేదన దాగుంది. ఇల్లు దాటి బయటకు వచ్చే స్థితిలో లేడని అర్థమయ్యింది. మరచిపోయిన బాల్య జ్ఞాపకాలను గుర్తుచేశాడు. అవన్నీ అతని భయం చుట్టూ గూడు అల్లుకున్నవే. మా స్కూలు, హాస్టలూ పక్కపక్కనే వుండేవి. వూరికీ స్కూలుకూ మధ్యన ఒక పెద్ద చింతతోపు వుండేది. పగలైనా ఆ తోపువైపు చూడ్డానికి నంజుండ భయపడేవాడు. అందరూ వాడి భయాన్ని సాకుగా తీసుకుని ఏడిపిస్తుంటే, నేనొక్కడ్నే తోడుగా వుండేవాణ్ణి. చదువు కంటే ఆటలు, బొమ్మలు గీయడాలూ వాడికిష్టం. 'అరేయ్, యీ చదువు కంటే మా తాత వెంబడి గొర్లు కాసుకోవడమే బాగుంటుందిరా,' అనేవాడు. 'అవున్రా, గొర్లు కాయడానికి వాటితోపాటు రాత్రుళ్లు చీకటిలో పడుకోవాలి గదరా,' అంటే, 'చుట్టూ కుక్కలుంటాయి గదా, మా తాతనో, చిన్నాయనలో తోడు వుంటారు గదా,' అనేవాడు. ఆ తర్వాత నంజుండ యెందుకిలా అయ్యాడు, అతని జీవితంలో యేం జరిగిందో, కలిస్తే తప్ప తెలియని విషయాలు. అదే నన్ను పాళ్యం వెళ్లేలా చేసింది.

ఒకరోజు మధ్యాహ్నం ఆలూరులో బస్సు దిగగానే, బస్టాండ్‌లో సిద్ధలింగప్ప బుల్లెట్‌తో సిద్ధంగా వున్నాడు. నన్ను చూస్తూనే సంబరపడ్డాడు.

"ఏమండీ మీరే వచ్చారు. ఎవర్నన్న పంపిండొచ్చు, లేదా నేనైనా ఏ పల్లెవెలుగు ఎక్కి వూరుకొచ్చేవాడ్ని కదా," అన్నాను.

“అట్లెట్లా సారూ, మీరు రావడమే పదివేలు. మీరు వస్తుండారంటానే మా నంజుండ కండ్లల్లో పెట్రోమాక్స్ లైట్లు వెలుగుతా వుండాయి.”

“ఏమండీ మీ వూర్లో కరెంటు లేదా...” హాస్యానికి అన్నా. ఆయనకు అర్థం కాలేదు.

“అరెరే ఎందుకు లేద్సార్, వుంది. అయితే యెబ్బుడూ కోతలే. మా వూరు పేరుకు ఆంధ్రాలో వుందిగానీ మా వ్యవహారమంతా బళ్లారితో. పొద్దున లేస్తే బళ్లారిలో వుంటారు సార్ మావాళ్లు. ఆఫీసు పనులకోసం ఆలూరుకూ ప్రైవేటు పనులకేమో కర్ణాటకకు. మా వూర్లో రెండు హైస్కూల్లు వుంటాయి. ఒకటి తెలుగు చదివే పిల్లలకీ, యింకొకటి కన్నడం చదివే పిల్లలకీ... అట్లయ్యీ అటు ఆంధ్ర కాక, యిటు కర్ణాటక కాక రెంటికీ చెడ్డ రేవడైనాం సార్.”

బుల్లెట్ వెనుక కూర్చున్నాను కాబట్టి హోరుగాలికి చెవులు దిమ్మెక్కిపోతున్నాయి. బండి గతుకుల రోడ్డు మీద కుదుపులతో వెళ్తోంది. దార్లో అక్కడక్కడా మనుషులు సిద్ధలింగప్పను పలకరిస్తున్నారు. వాళ్ల సంభాషణలు కన్నడంలో నడుస్తున్నాయి. ఒకాయ నెవరో సిద్ధలింగప్పను నా గురించి వాకబు చేస్తూ,

“ఏనప్పో జాత్రకే నెంట్రను కరికొండు హోగ్తాయెంగ కానొస్తే...”

(“ఏమప్పా మీ వూర్లో జాతరకు బంధువును పిలుచుకుపోతున్నట్టున్నావూ...”) అన్నాడు. సమాధానంగా సిద్ధలింగప్ప గట్టిగా నవ్వాడు.

“ఏం జాతరండీ మీవూళ్లో...”

“సార్ మా వూళ్లో గాదిలింగేశ్వర తాత రథోత్సవం. మంచి టయానికి వస్తాండారు మీరు. మావూరు నిండా జనాలుంటారు యీ రెంద్రోజులూ. మహరాష్ట్ర నుంచి కర్ణాటక నుంచి సావిరారు జన (వేలాది భక్తులు) రథోత్సవంకు యేటేటా వస్తారు... గాదిలింగేశ్వర స్వామి మా మూలపురుషుడు. మా కులదేవత. ఆయన యేర్పాటు చేసిండేదే మా వూరు. ఆయన గుడే మా బతుక్కు ఆధారం.”

“గాదిలింగేశ్వర స్వామి గురించి తెలుసండీ. అయితే రథోత్సవం యిప్పుడని తెలీదు. తెలిసుంటే యీ సందడి తగ్గాక వచ్చిందును.”

“అట్లెట్లా సారూ మీరు రావాల్సింది యిప్పుడే. ఇళ్లు దాటకుండా వున్న మా నంజుండను మీరెట్లైనా యీసారికి రథోత్సవంలోకి వచ్చేలా చేయాల. అందుకే ఆ గాదిలింగేశ్వరుడు మిమ్మల్ని మా వూరికి అంపిస్తాన్నాడు.”

ఆ మాటతో నేనేమీ మాట్లాడలేకపోయాను. నామీద యింత నమ్మకం యేమిటో నాకే మాత్రం అర్థం కావడంలేదు. యే కోణంలో నన్ను చూస్తున్నారో మరి... నా మౌనాన్ని

పట్టించుకోకుండా సిద్ధలింగప్ప ఒకవైపు వొడుపుగా డ్రైవింగ్ చేస్తూనే తన గురించి చెప్పుకుపోతున్నాడు....

...పాతరోజుల్లో, అంటే రాజశేఖరరెడ్డి సీయమ్ కావడానికి ముందు యిట్లా పబ్లిక్‌గా బండిమీద తిరగడమంటే ప్రాణాల్ని పణంగా పెట్టినట్లే వుండేదంట. ఏ బాంబు ఏ పక్కనుంచి మీదబడుతుందో, యే దారికాచి యెవరు మీదబడతారో అన్నట్లు వుండేదంట. ఇప్పుడు ఆ తరహా ఫ్యాక్షన్ లేదంట.

మరి యిప్పుడు యెలాంటి ఫ్యాక్షన్ వుందని అడిగితే, వూర్లో వ్యక్తిగత స్పర్ధలు వున్నా, పార్టీలున్నా, యిప్పుడు ఎత్తులన్నీ కాంట్రాక్టు పనులకూ, గనులలీజుకూ, భూ ఆక్రమణలకూ పోటాపోటీ నడుస్తుందంట.

మరి రైతుల సంగతేందంటే, పెద్ద రైతులందరూ కౌలు చేసుకొనేవాళ్లకు భూము లిచ్చి, కౌలు డబ్బులు, బ్యాంకులో పంటరుణాలూ, రుణమాఫీలూ, ఇన్సూరెన్స్ యిట్లాంటివన్నీ సంపాదించుకుంటా బాగుంటే కౌలుకు తీసుకున్నోడు పంటలు పండక, పంటరుణాలూ లేక, ఇన్సూరెన్స్ డబ్బులు అందక చచ్చిపోతున్నాడంట.

మాటల్లోనే తుంగభద్ర లోలెవల్ కెనాల్‌ను బండి దాటుతోంది. కాలువ ఎండి పోయి వుంది.

"మీరు మొన్న మీటింగ్‌లో చెప్పిన ఎత్తిపోతల పథకం నుంచి వేదవతి నీళ్లు యీ కాలువలోకే కదా సార్ యెత్తి పోసేది," అంటున్నాడు.

"అవునండీ, ఆ నీళ్లు యీ కాలువ నుంచినే వెళ్తాయి. ఆ పథకం కింద కొత్తగా కాలువలు తవ్వనవసరం లేదు. మీరు యెత్తిపోతల పథకాన్ని అందరికీ ప్రచారం చేసి నాయకుల్ని వొప్పించుకొని నిర్మాణం చేసుకుంటే మీ ప్రాంతం కోనసీమలాగా పచ్చగా తయారవుతుందండీ," అని వూరించా.

"నిజంగా వొస్తుందా సార్ ఆ ప్రాజెక్టు. రానిస్తారా దీన్ని. పెద్దపెద్దోళ్లు గమనిస్తాం టారు, మా మారుమూలలకు యిస్తే యెంతా యీకుంటే యెంత అనుకోరా."

"మీలాంటి ప్రజల్లో పట్టు వున్నవాళ్లంతా గట్టిగా పట్టుపడితే యెవరాపగల రండీ... నీళ్లు కళ్ల ముందే వున్నా, నీటి అలాట్‌మెంట్ చట్టబద్ధంగా వున్నా యెందుకు తీసుకోలేకపోతున్నామండీ, ఆలోచించండీ, గట్టిగా అడగడం లేదని కదా."

"నీళ్లు, మా యెదురుగ్గా పోయే నీళ్లు తీసుకోవచ్చనీ, తీసుకొనే మార్గాలు వున్నా యనీ తెలిసింది యిబ్డే సారూ. మీలాంటోళ్లు చెప్తుంటే యిప్పుడే తెలుస్తాంది. యింతకు ముందు మాకు యీ ఆలోచన్లే రానీలేదు. మమ్మల్ని సంపుకోవడంలో నరుక్కోవడంలో వుంచేసినారు. యేంటివో చిన్న చిన్న కాంట్రాక్టులు ఆశ చూపి దారి యేమార్చినారు. వాళ్లేమో పదవులూ పెద్ద పెద్ద గనులూ తవ్వేసుకొనే దాంట్లో మునిగిపోయినారు. వాళ్ల

చెప్పుచేతుల్లో లేకుండా జనాన్ని పచ్చగా బతికిచ్చే యిట్లాంటి ప్రాజెక్టులకు వొప్పు కుంటారా అని నా అనుమానం. ఒప్పుకోవాల్సి వస్తే గూడా యెన్ని అడ్డుపుల్లలేస్తారో, యెన్నోటు స్పర్ధలు లేగ్గొడతారో అని నా భయం.''

సిద్ధలింగప్ప నోటినుంచీ వచ్చిన ఆ మాటలు తన జీవితానుభవంతో చెప్పిన మాటలు. అవి వాస్తవాలు. ఆ మాటలతో సిద్ధలింగప్ప మీద గౌరవం కల్గింది. పరిస్థితుల ప్రభావం వల్ల మనుషులు దుర్మార్గమైన పనులు చేసి వుండవచ్చు, వాటికి నిర్గతి తర్వాత కాలంలో వాళ్లు చేసే పనుల వల్లా, ఆలోచనల ఆచరణ వల్లా సాధ్యమవుతుందని నాకనిపించింది.

''మీ అంచనా కాదనను సిద్ధలింగప్పగారూ, మనచుట్టూ వున్న నిస్సహాయ జనాల మంచి కోసం కొన్ని భయాల్ని జయించాలండీ. కొన్ని భయాలమీద రాజీలేకుండా కొట్లాడాలండీ...'' అన్నాను.

ఆ మాటకు, ''మీ మాట నిజమైతే, మీరూ, ఆ మారుతి సారూ చెప్పింది నేను చేస్తా. అయితే మీరు మా నంజుండ మనసులో పేరుకుపోయుండే భయాన్ని పోగొట్టండి సార్. చేయని తప్పును మీదేసుకొని, వాణ్ని వాడు శిక్షించుకుంటున్నాడు. వాణ్ని రక్షిం చండి సార్. మీతో మనసువిప్పి మాట్లాడుతాడనీ, మీరు వాడి మనసును నెమ్మది పరుస్తారనీ ఆశతో మిమ్మల్ని రమ్మన్నాము సార్,'' అంటూంటే, మేనల్లుడి మీద చూపు తున్న అపేక్ష గొప్పగా అన్పించింది.

అంతలో బండి వూరి ముందుకు వచ్చేసింది. ఎటుచూసినా జనాలే. ఎక్కడ బయలు కన్పిస్తే అక్కడంతా డేరాలు వేసుకొని శిబిరాలు శిబిరాలుగా జనాలు.

ఇంటిముందు బుల్లెట్ ఆగిన శబ్దానికి, పడశాలలోకి యిద్దరు మనుషుల భుజాల మీద చేతులు వేసి, నడుచుకుంటూ వచ్చిన వ్యక్తిని నంజుండగా వూహించాను. తెల్లగా పాలిపోయిన శరీరం, లోపలెక్కడో వున్న కళ్లు, నావైపు సారిస్తున్న దీర్ఘమైన చూపులూ, నేను కింద నుండి మూడు మెట్లు ఎత్తున వున్న పడశాలలోకి అడుగు పెడుతూనే రెండు చేతులతో నా చేతిని బిగించి పట్టుకున్న ఆ మనిషిలో నాక్కావాల్సిన వాడి కోసం ముప్పైయేళ్లు వెనక్కి వెళ్లి వెతుక్కుంటున్నాను. పొడగైన ముక్కూ, మీసాలు కమ్మేసినా సాగి కనబడుతున్న పెదవులూ యేవో పోలికల్ని చెప్తున్నాయి. కన్నడ హీరో రాజకుమార్‌కు ముక్కు పెద్దగా వుంటుంది. నంజుండకూ అంతే. 'యేరా మీ కన్నడా వాళ్లందరికీ ముక్కులు పెంచుకోవడమే పనా... ముక్కోడా,' అనే యెత్తిపొడుపూ గుర్తొ స్తాంది. ఒక ముసలామె నమస్కారం చేస్తోంది.

''మాయక్క, నంజుండ వాళ్లమ్మ,'' అంటున్నాడు సిద్ధలింగప్ప.

"నోడో, కరెకొండు బందిద్దీని," (చూడ్రా, పిలుచుకొని వచ్చాను) నంజుండ వైపు తిరిగి అంటున్నాడు. నంజుండ ఆయనవైపు చూడనైనా చూడలేదు. నన్నే చూస్తున్నాడు. పెదవులపై సాగదీసిన నవ్వు తప్ప, ముఖం నిండా దిగులే వుంది. నేను అతని భుజమ్మీద చేయి వేశాను. చిన్నగా వణుకుతున్నది శరీరం.

"యీవాగాదరూ నిమ్మామను మాతాడిసో కణా, నిన్న గెలియను కరికొండు బందాన్తానె," (నీ స్నేహితున్ని తీసుకొచ్చారు కదా అందుకైనా మీ మామను పలకరించరా నాయనా) అంటోంది వాళ్లమ్మ.

"సారూ పొద్దున్నే కలుస్తా..." అని చెప్పి నంజుండను ఒకసారి దీర్ఘంగా చూసి పోయాడు. ఆ కళ్లల్లో నంజుండ మీద ప్రేమే కన్పించింది. నంజుండ మాత్రం వాళ్ల మామవైపు కన్నెత్తి కూడా చూడలేదు.

నంజుండ, మంచంమ్మీద కూచుంటే, నేను ఎదురుగా కుర్చీలో కూచున్నా. సాయంత్రం ఎండ వాలుగాపడి కిటికీ నీడను ఎదురు గోడమీద పెద్దదిగా చూపుతోంది. ముప్పై యేళ్ల అఖాతం మీద యీ సాయంత్రం వారధిని కట్టాలని చూస్తోంది. నా మీద అపేక్ష చూపిస్తున్న యీ అపరిచిత ప్రపంచాన్ని అవగతం చేయించడానికి చూస్తోంది. ఎదుటి మనిషి లోపలి చీకటిని పోగొట్టే శక్తి యీ సాయంత్రపు వెలుగు నాకివ్వగలదా? అసలివన్నీ కాకున్నా యీ పరిచిత అపరిచితుడ్ని నాతో అనుసంధానించ గలదా? అన్నీ ప్రశ్నలుగా మారిన, రాత్రి కాబోతున్న యీ సాయంత్రాన్ని సమాధాన పరచాలి నేను.

"ఏం నంజుండా ఏంది యిట్లయినావు..." అనగలిగా.

నన్ను చూస్తూ కన్నీళ్ల పర్యంతమవుతున్న ఆ మనిషిని కొంత కొంతగా నాలోకి యింకించుకోవాలని నా ప్రయత్నం. ఆ క్షణంలో నేనొక డాక్టర్, అతనొక రోగపీడితుడు. అందునా డాక్టర్‌ను నమ్మి ప్రేమించే రోగి. అది చాలదూ అతనిలోకి పరకాయప్రవేశం చేయడానికి. ఒక్కసారిగా నా పదోతరగతి రోజుల్లోకి వెళ్లిపోయా. ఆ మనిషితో కలవ డానికి గింజుకుంటున్న నా అహాన్ని బాల్యావస్థకు అప్పగించి-

"ఏరా నంజిగా... సరిగ్గా కడుపుకింత బువ్వన్నా తింటాండావా లేదారా. గొర్లు కాసేదానికన్నా శక్తి కావాల్నా వద్దారా. అరే తిక్క నామగనే మీ గాదిలింగేశ్వర గొరజాడ చెప్పిన మాటలే మరచిపోయినావారా. తిండి తింటే కండకలుగోయ్ కండగలవాడే గొర్లవెంట తిరగగలడోయ్," అన్నా.

ఒక్కసారిగా అతడి కళ్లలో వెలుగు ప్రసరించింది. అప్పట్లో, హైస్కూల్ రోజుల్లో, 'గురజాడ మీవాడేరా ఆయన యింటి పేరు గొరజాడ,' అంటే వీడు నమ్మేవాడు. ఆ మాటతో పాత నంజుండ బయటికొచ్చేశాడు. నా కథలు వచ్చిన మాగజైన్లూ, నా పుస్తకాల

రివ్యూలొచ్చిన పేపర్ కటింగులూ, నా గురించి రాసిన ఆర్టికల్స్ అన్నీ ఫైల్ చేసి పెట్టుకున్నాడు. వాటిని చూపించాడు. వాడి అభిమానానికి నేను ఫిదా.

నిజానికి ఆ రాత్రి నా జీవితంలో ఒక వుద్విగ్నభరితమైన రాత్రి. నమ్మలేని నిజాలు విన్న రాత్రి. తుంగభద్రా నది పరవళ్లులాంటి నంజుండ జ్ఞాపకాల వరద నన్ను ముంచేసిన రాత్రి.

నంజుండ, నేనూ పదోతరగతి తర్వాత విడిపోయాం. నంజుండ ఆలూరులో ఇంటర్ చదివి, బళ్లారి వీరశైవా కాలేజీలో డిగ్రీ చేసి, ధార్వాడ యూనివర్సిటీలో ఎమ్మే చేరాడు. అక్కడ వేదవతి పరిచయమైంది. ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆమె అతన్ని యింటికి తీసుకెళ్లి తన తండ్రి శివశంకర్ భట్‌కు పరిచయం చేసేంత గాఢంగా మారింది. బళ్లారి దగ్గర పాళ్యం మా వూరంటే, గాదిలింగేశ్వర మఠం వున్న పాళ్యమేనా, అనడిగాడు శివశంకర్ భట్. అవును, అదే మీకెలా తెల్సు, అనడిగితే, 'ఓహో అయితే కురబల కుర్రవాడివి కదా,' అని కనుబొమలెగర వేశాడు. కాఫీగ్లాసు కిటికీ అంచులో పెట్టి వచ్చేస్తుంటే, పొడిపొడిగా, 'అప్పుడప్పుడు వచ్చి పోతుండు,' అన్నాడు. ఆ మరుసటి రోజే వేదవతి అన్న నాగరాజ భట్ యూనివర్సిటీ కొచ్చి మాట్లాడించాడు. ధార్వాడలోని యితర మిత్రుల ద్వారా తెలిసిందేమంటే, నాగరాజ భట్ అప్పులు చేయడానికీ వ్యసనాలలో మునిగితేలడానికీ కొదవలేదు. మొదటిరోజు నుంచినే నంజుండ దగ్గర చేయి చాచడం అలవాటు చేసుకున్నాడు. అక్కడున్న రెండేళ్లలో, యెన్నో నాటకీయ పరిణామాల మధ్య నాగరాజ భట్ వ్యసనాల మూలంగా వేదవతి కుటుంబం ధార్వాడ వదలి బళ్లారిలో తలదాచుకోవలసి వచ్చింది. ఆ కష్టకాలంలో ఆ కుటుంబానికి నంజుండ అండగా నిలిచాడు. బ్రాహ్మడు కాదనేది వొక్కటే శివశంకర్ భట్‌ను కుంగదీసిందిగానీ కూతురి ప్రేమను కాదనలేకపోయాడు. అలా అని సమ్మతీ చెప్పలేకపోయాడు.

నాగరాజ భట్ ధార్వాడలో చేసిన నిర్వాకాల తాడు పట్టుకొని పోలీసులు బళ్లారి దాకా వస్తుంటే భయపడ్డ శివశంకర్ భట్ ఒక సాహస నిర్ణయంతో, వేదవతి వద్దన్నా వినకుండా నివాసాన్ని పాళ్యానికే మార్చేశాడు. పోలీసులకు అంతుచిక్కకూడదనీ, పాళ్యంలో కర్ణాటక వాతావరణమే వుందనీ, గాదిలింగేశ్వర మఠంలో పూజారిత్వం సంపాదిస్తే, కొడుకు జీవితం గాడినపడుతుందనీ ఆశపడ్డాడు. వేదవతి కన్నడ పిల్లలకు ట్యూషన్లు చెప్పుకున్నా గడచిపోతుందనే భరోసా, నంజుండ తరగని అండా అతనితో ఆ పని చేయించింది. నాగరాజ భట్‌కూ అదే అర్థమైంది.

పాళ్యం పన్నెండు వందల గడప గల గ్రామం. ఏడువేలుపైబడిన జనాభా. ఎనిమిది వందలు పైబడి కుటుంబాలు గల కురబలదే వూరిమీద ప్రాబల్యం. నూట

యాభై కుటుంబాలు బోయలూ, నూరుపైబడి వడ్డెరలూ కురబల మీద రహస్యంగా కారాలూ మిరియాలు నూరుతుంటారు. మాదిగలూ, లింగాయతులూ చెప్పుకోదగ్గ సంఖ్యలో వున్నారు. వ్యవసాయ భూములపై పట్టు ప్రధానంగా కురబలదే, లింగా యతులకూ భూములున్నాయి. ఒకటి రెండు సేవక కులాల కుటుంబాలు తప్పితే మిగిలిన వారందరూ కూలీలుగా బతకాల్సిందే.

పాదరసంలాంటి బుర్రగల నాగరాజ భట్ పాళ్యంలో వున్న గుట్టు పట్టేశాడు. వూర్లో గాదిలింగేశ్వర మఠం కురబలదే. బోయలు శక్తివంతులేగానీ కురబలతో తూగ లేకుండా వున్నారు. వీరిద్దరి కేంద్రంగా వూరు చీలిపోయి వుంది. దాన్ని వుపయోగించు కుందాం అనుకున్నాడు నాగరాజ భట్. ఈ ఆలోచనతో మొదట కురబ పెద్దలను కలిసి గాదిలింగేశ్వరస్వామి గుడిలో తనను పూజారిగా చేసుకోమని అడిగాడు. 'గాది లింగేశ్వరుడు కురబల పూర్వీకుడు. ఆ గుడి పూజారిత్వం కురబలదే, వేరేవారికి యివ్వ,' మన్నారు. 'ఇంత ప్రసిద్ధి పొందిన మఠానికి బ్రాహ్మణుడు పూజారిగా వుండడం మంచిది, దానివల్ల గాదిలింగేశ్వరునికి యింకొంచెం శక్తీ, కీర్తీ కలుగుతాయి ఆలోచించుకో,' మన్నాడు నాగరాజ భట్. వీడివల్లే మా దేవునికి శక్తీ, కీర్తీ కలుగుతాయా... వీడూ వీడి అహంకారమూ, అనుకొని-

"బతకడానికి మావూరొచ్చిన వాడివి, మా గుడి పూజారిత్వం కావాల్సొచ్చిందా," అని సిద్ధలింగప్ప అవహేళన చేశాడు.

ఆ విషయాన్ని బోయలతోనూ ప్రస్థావించాడు నాగరాజ భట్. 'మీ వూరి మఠం మీద మీకూ హక్కుంది నన్ను పూజారిని చేయమని అడగండి మీకు లాభం చూపిస్తా,' నని వారిని వుసిగొల్పాడు.

తరతరాలుగా గాదిలింగేశ్వర స్వామి గుడి పూజారిత్వంతో, రథోత్సవం రోజుల్లో లక్షలాదిమంది భక్తులు సమర్పించే కానుకలూ యితర ఆదాయాలతో, మందిబల ముంది కాబట్టి అన్ని రాజకీయ పదవుల్లో కురబలే లబ్ధిపొందుతున్నారనీ కినుక వహించిన బోయలకూ వడ్డెరలకూ నాగరాజ భట్ ఒక ఆయుధంగా దొరికాడు. ఊరు రెండు శిబిరాలుగా మారింది.

నంజుండ, శివశంకర్ భట్‌ను ఎంత వేడుకున్నా ఆయన కొడుకును నియం త్రించలేకపోయాడు. వేదవతి యెంత బతిమలాడినా నాగరాజ భట్ తన కార్యకలాపా లను ఆపలేదు. గాదిలింగేశ్వరస్వామి మఠపు ధర్మకర్త మండలిని రద్దుచేసి దాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోర్టులో కేసు దాఖలైంది. ఆ బ్రాహ్మడు యింత దూరం రావడానికి నంజుండనే కారణమని సిద్ధలింగప్ప, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని దానికి నువ్వే బాధ్యుడవైతావని నంజుండను హెచ్చరించాడు.

దుందుడుకు పనులకు పేరుమోసిన నాగరాజ భట్, కర్నూలు కోర్టు కేసు మీద హాజరై పాళ్యం తిరిగి వస్తున్న కురబల మీద బాంబులతో దాడి జరపగా నలుగురు కురబలూ, అక్కడే జరిగిన ప్రతిదాడిలో ముగ్గురు బోయలూ చనిపోయారు. ఆ దాడిలో బతికి బయటపడ్డ సిద్ధలింగప్ప ఆ రాత్రి భట్టుల యింటికి నిప్పంటించగా ఆ మంటల్లో శివశంకర్ భట్, అతడి భార్య కాలిపోగా వేదవతి తీవ్ర గాయాలతో బళ్లారి ఆసుపత్రికి తరలిస్తుండగా చనిపోయింది. నాగరాజ భట్ పరారయ్యాడు.

నంజుండ చేతుల మీదుగా వేదవతి ప్రాణాలు విడువడంతో నంజుండ కుప్ప కూలిపోయాడు. మామను ద్వేషిస్తూ మంచం పట్టాడు. అప్పటినుండి, భగభగ మండి పోయిన వేదవతి అరుపులనే వింటూ, ఆ భయంలో అదే హింసలో చస్తూ బతుకు తున్నాడు.

"నంజుండా ఆమె చనిపోవడంలో నీ బాధ్యత యేముంది. ఆ బ్రాహ్మణున్ని యీ వూరు ఎవరు రమ్మన్నారు. కనీసం నువ్వైనా ఆ అమ్మాయిని తీసుకుని ఎక్కడికైనా వెళ్లిపోయుండచ్చు గదా," అనడిగాను.

"మా అమ్మకు నేనొక్కన్నే కొడుకును. యిల్లూ భూములూ ముసలి తల్లినీ వదిలేసి ఎక్కడికి వెళ్లాలో తెలిసిరాలేదు. యేదో వూర్లో వుంటారనుకున్నాగానీ నాగరాజ భట్ అంత వేగంగా వూరిని అల్లకల్లోలం చేస్తాడని అనుకోలేదు."

"మరి ఆ కేసులో మీ మామకు శిక్ష పడలేదా?"

"మొదట దాడిచేసింది బోయలు కాబట్టి, వాళ్ల దాడిలో తీవ్రంగా గాయపడి స్పృహలో లేననీ, ఆ తర్వాత ఆసుపత్రిలో చేర్పించారనీ ఎలిబీ సృష్టించుకొని కేసులో లేకుండా చేసుకున్నాడు. అది వేదవతి చేసుకున్న ఆత్మహత్యగా, ఆమె నిప్పంటించు కొంటే యింటితోపాటు నిద్రలో వున్న తలిదండ్రులూ మరణించారని కథ అల్లి కేసు ముగించారు. ఆమె తరపున సాక్ష్యం చెప్పడానికి యెవరున్నారు. నాలాంటి పిరికివాడిని ప్రేమించినదానికీ, దుర్మార్గుడైన అన్న వున్నందుకూ ఆమె జీవితం అలా ముగిసి పోయింది."

"నంజుండా, ఆ బ్రాహ్మడు నిన్ను ఆసరా చేసుకుని తన శక్తికి మించిన జూదం ఆడాడు. దాంట్లో నీ బాధ్యత లేదు. నీవు బాధపడీ సాధించేది లేదు."

"నా బాధ్యత లేదనొద్దబ్బా... నా కళ్ల ముందు వేదవతి పడిన నరకయాతన యిప్పటికీ మెదులుతానే వుంది. యెంత అన్యాయంగా ఒక ఆడపిల్ల జీవితాన్ని అగ్గి పాలు చేశాను. నేను పాపిని. బతికుండే అర్హత నాకుందా. యిప్పుడు బతుకుతున్న బతుకు ఒక బతుకేనా..."

"నంజుండా యిలా అనుకుంటూనే యీ పదిదేళ్లుగా జీవిస్తున్నావు. జీవచ్ఛవంగా వుంటూ మీ అమ్మను బాధపెడుతున్నావు. నీ టేబుల్ మీద యిన్ని పుస్తకాలున్నాయి కదా వాటిని చదివే వుంటావు.  చదవడమంటే జీవితాన్ని ఎదుర్కోవడానికి కావాల్సిన శక్తిని సంపాదించడమే. ఇట్లా నిర్వీర్యమైపోవడం కాదు. నీకు జరిగింది చాలా ఘోరమైన విషాదమే, కాదనను. బాగా ఆలోచించి చూడు, అదొక ఆక్సిడెంట్. దాంట్లో నీ ప్రమేయం యేముంది. నన్ను యెందుకు రమ్మన్నావో నాకు తెలీదుగానీ, నన్ను రమ్మనడమంటే నీ బాధను పంచుకోవడానికి సిద్ధమయ్యావని అర్థం. పంచుకోవడమెందుకంటే బాధను తగ్గించుకోవడానికి ప్రయత్నించడమే గదా. బాధ తగ్గాలంటే నువ్వు లేచి తిరగాల. ఈ జ్ఞాపకాల జైలు నుంచి బయటకు రావాల. నంజుండా నువ్వు వేదవతి కాలి బూడిదై పోయిందనుకుంటున్నావుగానీ ఆమె మీ వూరి పక్కనే వేదవతి నీళ్లుగా మారి పారు తున్నది. మీ పొలాల్లోకి జీవధారగా పార్లి మీ యిళ్లలోకి పంటలా రావాలని చూస్తున్నది. నువ్వొకసారి నీ మనసులో గూడు కట్టుకున్న భావాల్ని తుడిచేసి బయటకు వచ్చి చూస్తే నీ వేదవతి నీకు కొత్తగా కన్పిస్తుంది. రా మరి. బయటకు రాగలవా, నువ్వనుకొని జనాల్ని కూడగడితే మీ వూళ్లోనే కాదు చుట్టుపక్కల యాభై వూర్లలో వేదవతిని దేవతగా చేసి చూపవచ్చు."

కళ్లు విప్పార్చి మంత్రముగ్ధుడిలా నా మాటలు వింటూ తలూపుతున్నాడు నంజుండ.

ఆ రాత్రి యే తెల్లవారుజామునో యింత నిద్రపోగలిగాము.

## 3

తెల్లవారాక చాలా పొద్దుపోయాక నిద్ర లేచాం. ఇన్నేళ్లలో నంజుండకు యింత నిద్రపట్టడం యీ పొద్దేనంటోంది, నంజుండ వాళ్లమ్మ. అప్పటికే వూర్లో వొక్కటే సందడి వినిపిస్తోంది. గాదిలింగేశ్వర రథోత్సవపు కోలాహలం అది. సిద్ధలింగప్ప నన్ను చూడ్డానికి వచ్చాడు. వూరినిండా యిసకేస్తే రాలనంత జనం వున్నారన్నాడు. మీరు గూడా వుత్సవం లోకి రాండన్నాడు.

"అంతమంది జనాల్లోకి నేను రాలేను, నంజుండతో వుంటానన్నాను."

"మీరు యెట్లచేసీ నంజుండను యీ జనాల్లో నుంచి గుళ్లోకి తీసుకొని వస్తే చాలు వాడికి యీ బాధ నుంచి ముక్తి కలుగుతుంది," అన్నాడు.

"మేము గుళ్లోకి రావడమేమోగానీ వచ్చేలోపు జనాల కాళ్లకింద నలిగిపోయి నిజంగానే విముక్తి లభిస్తుంది," నవ్వుతూ అన్నాను.

"మా గాదెలింగప్ప తాత బ్రాహ్మల దేవుడు కాడు. గొర్లు కాసుకుంటూ తన చుట్టూ చేరిన మనుషులని ప్రేమిస్తూ సంరక్షించే మామూలు మనిషి. ఆయన కోసం

ప్రేమతో నడిస్తే ఆయనే చేరదీసుకుంటాడు. మీరు ప్రయత్నం చేయ,"మన్నాడు. నంజుండ కోసమైనా చేయమన్నాడు.

"మహిమల కోసం దేవుడికన్నా మామూలు మనుషుల్ని నమ్మేవాణ్ణి నేను. నంజుండను మనుషుల్లో కలుపుతా పొండి," అన్నాను.

రథాలు వూరంతా వూరేగుతూ ప్రధాన వీధిగుండా గుడికి చేరే సమయంలో నేనూ నంజుండ వీధిలోకొచ్చాం. మూడు రాష్ట్రాల భక్తులు రథాల మీదకు పూలూ పళ్లూ విసురుతున్నారు. చాలామంది అనుకుంటున్నది యేమంటే, యీసారి కర్ణాటక క్యాంపుల నుంచి చాలామంది భక్తులు వచ్చారని. మేమట్లా నాలుగు అడుగుల వేస్తూనే, నన్ను గుర్తుపట్టి పలకరించాడో కొత్త మనిషి,

'ఎవరండీ మీ,'రంటే-

"మొన్న ఆలూరు మీటింగులో మీరూ వున్నారు కదండీ, వేదవతి యెత్తిపోతల పథకం వచ్చినట్లేనా," అనడిగాడు .

"రావాలనే గదా మనుషుల్ని కూడగడుతున్నాం."

ఆ మాటతో ఆయన చాలా వుత్సాహంగా వేదవతి ప్రాజెక్టు గురించి తాను సేకరించిన వివరాల చెప్పడం ప్రారంభించాడు.

"నా పేరు వెంకటేశ్వర్రావండీ. మేం బళ్లారి చుట్టుపక్కల సెటిల్ అయిన తెలుగువాళ్లం. ఇట్లాంటి ప్రాజెక్టుల వల్ల మన రాష్ట్రం అభివృద్ధి అవుతుందంటే మాకు సంతోషం. ఈ ప్రాజెక్టు కోసం ప్రయత్నాలు ఆపకుండా చెయ్యండి. మేంగూడా మాకు చేతనైన సహాయం మా రైతు సంఘం నుండి చేయిస్తాం," అన్నాడు.

"మంచిదండీ అలాగే చేద్దాం," అని బయటపడ్డాం.

నేనూ నంజుండ వూర్లో కాసేపు తిరిగి చీకటి పడుతుండగా గుడివైపు నడిచాం. మమ్మల్ని చూసి లోపలికి తీసుకుపోవడానికి సిద్ధలింగప్ప యెదురొచ్చాడు. నంజుండను చూస్తూ చాలా సంబరపడ్డాడు.

"మా వూరి భూములకు రెక్కలు వస్తున్నాయి సార్ మీ వల్ల," అన్నాడు, వ్యంగ్యంగా.

"ఎలా మొలిచాయండీ," అడిగాను అమాయకంగా.

"బళ్లారి నుంచి, కర్ణాటక క్యాంపుల నుంచి చానామంది వచ్చి చుట్టుపక్కల భూముల వివరాలు విచారిస్తాండారంట. ఎవరైనా అమ్మేవాళ్లుండారా అని అడుగు తున్నారంట," అన్నాడు.

"మంచిదే కదండీ మీ మెట్టభూముల్లో వ్యవసాయ ప్రయోగాలు జరుగుతాయి, మీరు నాగరికతలోకి వస్తారులెండి," అంటే-

"పన్నెండేళ్ల కింద యీ కురబల గుడిసొత్తు కోసం ఒగ బాపనయ్య పెద్ద రంపు చేసిపాయ. యిబ్బుడు వేదవతి నీళ్లు యెన్ని రంపుల్ని వెంటబెట్టుకొని వస్తాయో," గొణుక్కుంటున్నాడు సిద్ధలింగప్ప.

లోపలికెళ్తే, హుండీ లెక్కబెడుతున్నారు.

గుట్టలు గుట్టలు రాశులుగా నోట్లూ నాణేలూ రకరకాల నగలూ లైట్ల వెలుగులో కళ్లు జిగేల్ మంటున్నాయి. దేవుడి సంపదను కురబ పూజారులు లెక్కేసుకొని పంచుకుంటున్నారు.

"ఈ సంపద కోసమే ఆ బ్రాహ్మడు అంత నిర్వాకం చేసింది," నంజుండ గొణుక్కుంటున్నాడు.

నీళ్లను పసిగట్టిన కొత్త పూజారులు యీ నేల మీద యింకా యెన్ని నిర్వాకాలు చేస్తారోగదా అని నాకనిపించింది. వెంటనే మారుతి గుర్తొచ్చాడు.

భూములు అమ్మవద్దని యీ ప్రాంతంలోని రైతుల్ని కోరుతూ మారుతి యింకో కార్యక్రమం చేపట్టాలేమో ననుకుంటుంటే పెదాలపై శుష్కమైన నవ్వు మొలిచింది. ఈ సారి తన కార్యక్రమాల్లో నంజుండనూ కలుపుకొమ్మని మారుతికి చెప్పాలనిపించింది.

*అరుణతార మాసపత్రిక*
*సెప్టెంబర్ 2019*

❋



28 ఏప్రిల్ 1964న అనంతపురం జిల్లాలో పుట్టిన **జి. వెంకటకృష్ణ** మొదటి కథ ***పాముని మింగిన కప్ప*** 1994లో ఆంధ్రప్రభలో అచ్చయింది. *60కి పైగా కథలు రాశారు. గరుడస్తంభం, చిలకలు వాలిన చెట్టు, దేవరగట్టు* కథాసంపుటాలు, నాలుగు కవితా సంపుటాలు, రెండు దీర్ఘకవితలు ప్రచురించారు. *కథా సమయం, హంద్రీ కథలు* సంకలనాలకు సహ సంపాదకులు. ఆంధ్రప్రదేశ్ సహకార శాఖలో ఉద్యోగం.

***చిరునామా: 87-1287-1, సోమిసెట్టి నగర్, కర్నూలు - 518 002.***
***ఫోన్: 89850 34894 venkatakrishna838@gmail.com***